22న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

రామంతాపూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ అనుబంధ సంస్థ సేవా భారతి ఆధ్వర్యంలో ఈనెల 22న వెంకటనగర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్యకేంద్రంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓగిరాల సిద్దార్థ మిలింద్ బేడే తెలిపారు. ఉదయం 9.30 గంటలనుంచి సాయంత్రం నాలుగన్నర వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో రొమ్ము క్యాన్సర్ ఓరల్ క్యాన్సర్ ప్రొస్టేట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. 8519874154, 9866462854 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పీఆర్ఏసెట్ జిల్లా కమిటీ నియామకం

మల్కాజిగిరి: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ అసోషియేషన్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం మల్కాజిగిరిలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా టి.కవిత, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే పూర్తి స్థాయి కమిటీ నియామకంతో పాటు మండలాల వారిగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

చలో జీతే హైన్ స్ఫూర్తిదాయకం


చలో జీతే హైన్ చిత్రాన్ని వీక్షిస్తున్న గీతామూర్తి తదితరులు

మల్కాజిగిరి: ప్రధాన మంత్రి మోదీ బాల్యంపై నిర్మితమైన షార్ట్ ఫిలిం చలో జీతే హైన్ స్ఫూర్తిదాయకమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతా కృష్ణ అన్నారు. శుక్రవారం ఆర్కే నగర్ ఆర్‌సీపీఎల్‌లో పలువురు నాయకులతో కలిసి షార్ట్ ఫిలింను వీక్షించారు. గీతామూర్తి మాట్లాడుతూ నేటితరమే కాకుండా భావి తరాలు కూడా స్ఫూర్తి పొందవచ్చునన్నారు. మోదీ లాంటి నాయకుడు ప్రధానిగా ఉండడం భారతదేశ అదృష్టమన్నారు.సీనియర్ నేత సుధాకర్ మాట్లాడుతూ మరో వారం రోజులు ఈ చిత్రం ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రసన్న, ఆదిత్య, ఉపేందర్‌రెడ్డి, అంజలి, దినేష్, వాసుదేవ పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదుల ఆందోళన



కుషాయిగూడ: మంచాలలో మహిళా న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో ఆందోళన చేపట్టారు. న్యాయవాదులపై వరుస దాడులు జరగడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌర హక్కులను కాపాడటంలో విశేష కృషి చేస్తున్న న్యాయవాదులపై దాడులు జరగడం దారుణమన్నారు. ప్రొటెక్షన్ యాక్ట్‌తోనే న్యాయవాదులకు రక్షణ ఉంటుదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే కేన్సర్ నివారణ సాధ్యం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ఉప్పల్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి, ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని గాంధీ జయంతి వరకు 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు డా శిల్పారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్‌లోని సంజనా మాలతి అపార్ట్‌మెంట్‌లో కేన్సర్ అవగాహన, నిర్మూలన శిబిరంతో పాటు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలో గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేసుకోవచ్చన్నారు. దేశంలో కేన్సర్ వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. వ్యాధి బారిన పడిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నయం చేసుకునే అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులపై
నీలినీడలు

రూ.110కోట్లు కేటాయించినా ముందుకు సాగని వైనం

- ప్రభుత్వాలు మారినా తీరని ముంపు బాధితుల సమస్యలు
- వర్షం పడితే చాలు జంకుతున్న పీర్జాదిగూడవాసులు


బండి గార్డెన్ రోడ్డు దుస్థితి(ఫైల్)

మేడిపల్లి: వరద సమస్య ఈ ఏడాదైనా తీరుతుందని ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలకు చివరికి కన్నీరే మిగిలింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు నగరశివారు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని ముంపు ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది.వర్షం పడిందంటే చాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ.. కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లపై మోకాలి లోతుకు పైగా వరద చేరుతుండటంతో పలు కాలనీలు జలదిగ్బంలో చిక్కుకుంటున్నాయి. దీంతో కాలనీలు బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది.ఏళ్ల తరబడి ఉన్న వరద సమస్యను దృష్టిలో పెట్టుకుని అప్పటి పాలక వర్గం జంట కార్పొరేషన్ల వరద నివారణకోసం దాదాపు రూ.110కోట్లతో ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టును చేపట్టి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అయితే శాఖల మధ్య నిధుల సమీకరణ, సమన్వయ లోపం కారణంగా పనులు ఆగుతూ.. సాగుతూ ముంపు ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. నేటికి నాలుగేళ్లు గడిచినా పనులు మాత్రం సగం కూడా పూర్తి కాలేదు.ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారానికి పాలకులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదు. రూ.110కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వరద కాలువ పనులు నేటికీ యాభై శాతం కూడా పూర్తి కాలేదు. బోడుప్పల్, చెంగిచెర్ల నుంచి వచ్చే వరద నీటితో వరంగల్ ప్రధాన రహదారి, పీర్జాదిగూడలోని 1,2,5,10,15,16,17,19, వార్డులు జలమయమవుతున్నాయి. అయితే తాత్కాలిక చర్యలు చేపడుతున్న అధికారులు శాశ్వత పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు శాశ్వత పరిష్కారానికి సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.


నత్తనడకన సాగుతున్న ఎస్‌డీపీ పనులు

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



పీర్జాదిగూడలో వరద ముంపు శాశ్వత పరిష్కారం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 110కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తే.. నేటి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పీర్జాదిగూడ నుంచి పర్వతాపూర్ వరకు ఇటీవల వేసిన ఫోర్‌లైన్ రోడ్డును కూడా తవ్వి నాశనం చేశారు.

– ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి
బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, పీర్జాదిగూడ

అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం



వరద సమస్యపై గత ప్రభుత్వంలో పాలక వర్గం రూ.110కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వరద సమస్యను గుర్తించి దశలవారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. త్వరలోనే సమస్యను మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్

లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



వర్షాకాలం వచ్చిందంటే పీర్జాదిగూడలోని పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఐదేళ్లుగా ఏటా సమస్య పునరావృతం అవుతున్నా పట్టించుకున్న నాథుడు కరువయ్యారు. ప్రభుత్వాలు మారుతున్నా వరద సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.ఎస్ఎన్‌డీ పనులు మేమంటే.. మేమే చేశామని పాలాభిషేకాలు చేసిన నాయకులు పత్తాలేకుండా పోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్‌తో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– వెంకట్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు


జలమయమైన విహారికా కాలని(ఫైల్)


జలమయమైన వరంగల్ జాతీయ ప్రదాణ రహదారి (ఫైల్)

ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే



అల్వాల్: యాప్రాల్‌లోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీ మాతా నిమిషాంబదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

ఉప్పల్: పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని చిలుకా నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ అధికారులతోనే సాధ్యం కాదని, ప్రజలంతా భాగ సామ్యులు కావాల్సిన అవసరం ఉందన్నారు. మన ఇంటిని ఎలాగైతే శుభ్రంగా ఉంచుకుంటామో వీధులను కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెత్తను వీధుల్లో, రోడ్ల మీద వేయకుండా చెత్త రిక్షా వారికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ ప్రొ. కుమార్ తదితరులు

ఉప్పల్: గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డా. కుమార్ అన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణలో గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహా విష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరానికి గాంధీ రోల్ మోడల్ అన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నైతిక జీవనం, మితాహారం వంటి గాంధీ నియమాలు అందరూ పాటించాలన్నారు. అక్టోబర్ 10 నుంచి నిర్వహించే సుస్థిర విజ్ఞాన సదస్సులు విజయవంత చేయాలని కల్వ సుజాత కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం జాతీయ కార్యశాలను తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం ప్రారంభించారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డా. గున్న రాజేందర్ రెడ్డి, గాంధారి ప్రభాకర్, గాంధీ నేచురోపతి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎంవి. మల్లికార్జున్, మహేశ్వర్, ఆచార్యులు కసిరెడ్డి వెంకట రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించాలి

కుషాయిగూడ: మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. చర్లపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులతో కలిసి బతుకమ్మను పేర్చారు. వారితో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, పిల్లలకు సంస్కృతిపై అవగాహన పెంచేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బోయ నరేష్, పాఠశాల కరస్పాండెంట్ గద్దం యాదగిరి, వంగాల వెంకన్న, ప్రేమ్, వంశీరాజ్, సర్వరాజ్, నీరజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ వేడకల్లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి..

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి


సమావేశంలో పాల్గొన్న నల్లా రాధాకృష్ణ తదితరులు

మల్లాపూర్: ప్రభుత్వ అధికారులు బతుకమ్మ నిమజ్జన కోసం చెరువుల వద్ద ఘాట్‌లను ఏర్పాటు చేయాలని బతుకమ్మ ఉత్సవ సమితి సలహాదారు నల్లారాధాకృష్ణ అన్నారు. శుక్రవారం నాచారంలో బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయం వద్ద నాచారం బతుకమ్మ ఉత్సవ సమితి ఆవిర్భ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ఆడపడుచులకు ఇది గొప్ప పండుగ అన్నారు. హెచ్ఎంటీనగర్ చెరువు వద్ద నిమజ్జన ఘాట్‌లను, గ్రౌండ్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ అన్నపూర్ణ, అశ్విని, రాధామణి, మంజుల, స్మృతి, హరిత, మాధవి, దేవి, శోభ, వనజ, పావని, ప్రసన్న, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా


పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థిపై దాడి ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసువాలని కోరుతూ శుక్రవారం ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ మాట్లాడుతూ..బాధిత విద్యార్థి వైద్య ఖర్చులు యాజమాన్యమే భరించాలన్నారు. పాఠశాల చైర్మన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో నాయకులు గిరిబాబు, శేఖర్, రాకేష్, ప్రభు, శ్రీకాంత్, మహేష్, అజీమ్ పాషా, సమీర్, సోను, షాబాజ్,ఇర్ఫాన్, రాజేష్, విజయ్ కుమార్, ఆకాష్, అజయ్, స్వాజిత్, జీవన్,వికాస్ పాల్గొన్నారు.

లయోలాలో మిల్లెట్ ఫెస్టివల్


ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీలో శుక్రవారం మిల్లెట్ ఫెస్టివ్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మిల్లెట్ల ప్రదర్శన, స్టాళ్లను తెలికించారు. ఈ సందర్భంగా మిల్లెట్లలో పోషక విలువలపై అవగాహన పెంపొందించడంతో పాటు, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యూట్రి హబ్-ఐకార్-ఐఐఎంఆర్ సీఈవో, డైరెక్టర్ డాక్టర్ జాన్సన్ స్టాండ్లీ, కళాశాల కరెస్పాండెంట్ ఫ్రాన్సిస్ జేవియర్, వైస్ చైర్మన్ ఫాదర్ అమర్‌రావు, ప్రిన్సిపల్ పాదర్ డాక్టర్ ఎస్‌బి.బాబు, నిర్వాహకులు డాక్టర్ భవానీ, అధ్యాపకులు, మిల్లెట్ స్టాల్స్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి తన ఇంటి మూడో అంతస్తు పై నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్‌ను ఏర్పాటు చేసుకున్నాడని సదరు టవర్ వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఇందిరానగర్ చెందిన ప్రజలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సెల్ టవర్ వల్ల వచ్చే రేడియేషన్‌తో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశఁందని, వెంటనే సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి సెల్ టవర్‌ను తొలగించాలని కోరారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ అక్రమంగా ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు, కాలనీవాసులు శ్రీనివాస్, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఇందిరానగర్ వాసులు

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


కమాన్‌ను ప్రారంభిస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. 24వ డివిజన్ పరిధిలో మాజీ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ దంపతులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన జ్యోతినగర్ కాలనీ కమాన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తలు ముందుండాలన్నారు. ఆర్థికంగా ఉన్న వారు సొంత నిధులతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. కాలనీ ప్రజలకు సొంత నిధులతో కమాన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, బింగి జంగయ్యయాదవ్, కుంభం కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ల పర్యటన


దుర్గానగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్


మాన్సూన్ టీంకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి..


విష్ణుపురి కాలనీలో బాక్స్ డ్రైన్ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: వర్షాలతో ముంపునకు గురవుతున్న కాలనీల్లో శుక్రవారం కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, శ్రవణ్, బొంతు శ్రీదేవి పర్యటించారు. మల్కాజిగిరి డివిజన్‌లో పర్యటించిన శ్రవణ్ అధికారులకు పలు సూచనలు చేశారు. బండచెరువు నుంచి నీటిని ఎలాంటి సమాచారం లేకుండా కిందికి ఎలా వదులుతారని ఇంజినీరింగ్ అధికారి డీఈ మహేష్‌ను ప్రశ్నించారు. ప్రజలు కొందరు నాలాల్లో పరుపులు ,దిండ్లు, ప్లాస్టిక్ చాపలు వేస్తున్నందున వరదనీరు సాఫీగా వెళ్లడం లేదన్నారు. కొన్ని రోజులుగా వర్షం పడుతుండడంతో నాలాల్లో , బాక్స్ డైన్‌లో చెత్తను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ మహేష్, హైడ్రా సూపర్‌వైజర్ శ్రీనివాస్, విఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో..

డివిజన్ పరిధిలోని దొడ్లబస్తీ, దుర్గానగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మిలతో కలిసి పర్యటించారు.చిన్నపాటి వర్షానికి నీరు ఇళ్లలోకి వస్తున్నదని డ్రైనేజీ సమస్యలతో పాటు దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బండచెరువు ఎగువ ప్రాంతం, ఆనంద్‌బాగ్ ప్రాంతాల నుంచి వర్షం నీరు ఎక్కువగా వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమస్య పరిష్కారానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

చర్లపల్లి డివిజన్ పరిధిలో..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. ఆదర్శనగర్, శివసాయినగర్, సాయికృష్ణ ఎంక్లేవ్ ప్రాంతాల్లో పర్యటించి వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. మానుసూన్ టీం ప్రతినిధులతో మాట్లాడి డివిజన్ పరిధిలో వరదనీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు, నిలిచిపోయిన నీటిని పంపులో తోడించడం వంటి తక్షణ సహాయక చర్యలను చేపట్టారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.